# కథావేదిక

**మంచి కథల్ని మళ్ళీ మళ్ళీ చదువుకోవడం కోసం**
**కథలన్నింటినీ ఒకే గుత్తిగా అందిస్తున్నాం.**

ఒక విధంగా నేనెంతో అదృష్టవంతుణ్ణని ఎప్పుడూ గర్వపడుతుంటాను. ఎందుకంటే నా వ్యక్తిత్వానికి తగ్గ భార్య లభించడం. నాలో నేను ఎన్నోసార్లనుకున్నానామాట. ఇప్పుడు మళ్లా అనుకున్నాను. ఇప్పుడు మళ్లా ఎందుకనుకున్నానో తెలుసుకోవాలంటే రామారావు కథ వినక తప్పదు మరి!

• • •

రామారావు మా ఆవిడకి వేలు విడిచిన మేనమామ కొడుకు. అతణ్ణి సమ వయస్కులు 'రామం' అంటారు, పెద్దవాళ్లు 'రా వుడూ' అంటారు. నాలాంటి మొహమాటస్తులు 'రామారావుగారూ' అంటారు. బక్క పలచటి విగ్రహం, మధ్యపాపిడీ, కొద్దిగా ముందుకి చొచ్చుకుని వస్తున్నట్టుండే మెడా- సాక్షి రంగారావునీ, సీయస్సార్‌నీ కలిపి తయారు చేసినట్టుంటాడు. స్టేటు గవర్నమెంటులో గుమస్తా ఉద్యోగం.


నా పెళ్లిలో అతనితో పరిచయం కలిగింది. అతని మీద నా ఫస్టింప్రెషన్ మహా చెడ్డదిగా ఏర్పడింది. అతడు 'అతి చనువు' తీసుకుంటున్నాడనిపించింది. కాని, తర్వాత మా ఆవిడవైపు బంధువుల ఇంట జరిగిన ఒక పెళ్లిలో అతడిని చూసాక లెంపలేసుకుని మరీ నా దురభిప్రాయాన్ని సరి దిద్దుకున్నాను. ఆ పెళ్లి తర్వాత ఎన్నో పెళ్లిళ్లలో అతణ్ణి కలుసుకోవడం తటస్థించింది. ఇక 'రామారావు' అనబడే ఆ యంత్రం మీద విపరీతమైన అభిమానమేర్పడిపోయింది!

ఒఖ్ఖ రామారావు చాలు!

వంద మనుషుల పెట్టు పెళ్లి పనులు చేయడానికి!

## నూటికొక్కరు!

ఎమ్మెస్వీ గంగరాజు





## చీవాట్లు

''ఏమిటే! ఇది కూరలాగుందా? ఉప్పులేదు. కారం లేదు!'' చిందులు తొక్కాడు బ్రహ్మానందం.

''అయితే ఈరోజు కూడా మీ బాస్ మీకు చీవాట్లు పెట్టాడన్నమాట.'' తాపీగా అంది భార్య.

## రచన

''నీ రచనంతా తడిసిపోయి, అక్షరాలు అసలు కనపడటంలేదు!'' అన్నాడు ఎడిటర్.

''అదో విషాద కథండీ. వ్రాస్తుంటే కన్నీళ్ళు కారి అలా తడిసిపోయింది.'' చెప్పింది రచయిత్రి.

## అక్రమం

''నాన్నా! మీ నాన్న నిన్ను కొట్టేవాడా?'' అడిగాడు కొడుకు.

''చితకబాదేవాడు!'' చెప్పాడు తండ్రి.

''మరి మీ తాత మీనాన్నను కొట్టేవాడా?''

''తోలు ఒలిచేవాడు!''

''ఎంతోకాలంగా సాగుతున్న ఈ అక్రమాన్ని మనిద్దరం ఇకనుంచి ఆపేద్దాం నాన్నా!''

**- శ్రీనివాస్ వల్లాల** (నారాయణఖేడ్)

## రోబోట్

''అమ్మా! లక్ష రూపాయలిస్తే రోబోట్ తయారు చేస్తా'' అన్నాడు కొడుకు.

''రోబోట్ అంటే ఏం చేస్తుందిరా'' అంది అమ్మ.

''బరువులు మోస్తుంది. బట్టలుతుకుతుంది. తోటపని చేస్తుంది. ఇంకా చెప్పాలంటే చెప్పిన పనంతా చేస్తుంది'' అన్నాడు కొడుకు.

''ఓస్ అంతేనా? పైసా ఖర్చులేకుండా చెప్పిన పనల్లా చేసే మీనాన్న వుండగా ఇక రోబోట్ ఎందుకురా! అదో దండగమారి ఖర్చు'' అంది అమ్మ.

**-కలవకుంట్ల గురునాథపిళ్ళై,** (మదనపల్లె)




అందుకే మా ఆవిడ వైపు వారెవరింట్లో ఏ పెళ్ళిళ్లూ, పేరంటాలూ జరిగినా ప్రత్యేకంగా రామారావుకి పదిరోజుల ముందుగా ఠంచనుగా శుభలేఖ అంది తీరుతుంది. ఆడపెళ్లివారైతే సరేసరి! రామారావునీ అతని పాప్యులారిటీని గమనించాక మావైపు బంధువులు కూడా నాకు శుభలేఖ ఇచ్చేటప్పుడు మరో ఎక్స్‌ట్రా కార్డు ఇచ్చి, ''బాబ్బాబూ, ఇది రామారావుగారికిచ్చి ఎలాగోలా నీతోపాటు ఆయన్ని కూడా తీసుకుని రావా''లంటూ చేతులు పట్టుకునేవారు. తలవని తలంపుగా తలపై బడ్డ ఈ బ్రోకర్ గిరీ వలన రామారావుకి మరీ దగ్గరయ్యాను.

పెళ్లిళ్లలో హడావిడంతా రామారావుదే! పందిళ్లు వేయించడం, షామియానాలు కట్టించడం, సప్లైయర్స్ వద్దనుండి ఏఏ సామానులు ఎన్నెన్ని తెచ్చుకోవాలో లిస్టు తయారుచేసుకోవడం, పెళ్లివారికి కాఫీ టిఫిన్లూ, భోజనాలూ, వడ్డనలూ- మొదలగు పనులన్నీ రామారావు ఆజమాయిషీలో జరగవలసిందే!

చీకటి ఉండగానే తెల్లారకుండా వంటవాళ్లని లేపేస్తాడు. వేడి వేడిగా కాఫీ తయారు చేయించి భజంత్రీల వాళ్లదగ్గరకు లంఘించుకుంటాడు- ''మగపెళ్లివారికి మేలు కొలుపులు చెప్పాలి. లేవండిక'' అంటూ వాళ్లని లేపేసి ఓ కప్పుడేసి కాఫీ వాళ్లకి పోస్తాడు.

ఇతడి హడావిడికీ, భజంత్రీల మోతకీ మగపెళ్లివారి నిద్రలు తేలిపోతాయి వీళ్ల బృందం విడిది చేరీ చేరగానే. 'బాబాయిగారూ', 'బావగారూ', 'మామయ్యగారూ', 'అత్తయ్యగారూ', 'ఒదినగారూ'- ఇలా వయసుని బట్టి ఒక్కొక్కరికీ ఒక్కో వరస అప్పటికప్పుడే కలిపేస్తూ అందర్నీ మేల్కొలిపి ఆవిర్లు కక్కుతున్న కాఫీ గ్లాసులు ఒక్కొక్కరికీ అందించుతాడు- ''ముందు ఈ కాఫీలు తాగండి. ఇప్పుడే ఫిల్టర్ తీయించాను. వేడి వేడిగా వుంది. చల్లారిపోతే మజా రాదు. కాఫీలు తాగేక బ్రష్ చేసుకోవచ్చు. ఫర్వాలేదు. అరగంట పోయాక ఫ్రెష్ మిల్క్ వస్తుంది. అప్పుడు మరో రౌండు తిప్పుతాం.'' అంటాడు. అతని వాక్చాతుర్యానికి తలవంచో, కాఫీ వాసనకి ఆకర్షించబడో నిద్రచాలించి అందరూ కాఫీ గ్లాసులందుకుంటారు. అలా మొదలౌతుంది అతని దినచర్య పెళ్లిళ్లలో!

గాడి పొయ్యి దగ్గరా, పెళ్లిపందిరిలో, విడిదిలో- ఎక్కడ చూసినా హడావిడి చేస్తూ కనిపిస్తాడు. వంటవాళ్లని ఖాళీగా కూర్చోనివ్వడు. గాడిపొయ్యి ఖాళీగా ఉండనివ్వడు. పెళ్లి పెద్దని స్థిమితంగా వుండనివ్వడు. పెళ్ళంతా తానే అయి కలియతిరుగుతూంటాడు.

''అయ్యా, జిలేబీలు ఈ పూట స్వీటన్నారు. ఈ తడి పంచదార పనికిరాదు. పొడిగా ఉన్నది పదిహేను కేజీలు వేరే తెప్పించండి.''

''రేపు బొబ్బట్లంటున్నారు. మరో ఇద్దరు ఆడవాళ్ల సాయం కావాలి వంటవాళ్లకి. లేకపోతే భోజనాల టైంకి అందుకోలేం.''

''పెరుగు ఆవడలు కూడా అంటున్నారు. మరో పది లీటర్ల పాలు ఎక్స్‌ట్రా చెప్పారా? చూస్కోండి మరి!''

– ఇలాంటి మాటలతో పెళ్లి పెద్దని గజగజ లాడించేస్తాడు.

ఇక వడ్డనల సమయంలో అందర్నీ పేరు పేరునా పిలుస్తూ భోజన కార్యక్రమం రసవత్తరంగా నడిపిస్తాడు. మధ్య మధ్యలో 'మధ్యే మధ్యే పానీయం'లా గాడిపొయ్యి దగ్గరకెళ్లి ఓ చేత్తో 'కెప్టెన్' సిగరెట్టూ మరో చేత్తో టీ గ్లాసూ జాయింటుగా ఊదేసి వస్తూంటాడు.

అందరి భోజనాలూ అయ్యాక మర్నాటికి పాత్రలన్నీ సర్దిపెట్టించి అతను పడుకునేసరికీ రాత్రి పదకొండు దాటుతుంది. ఏ భోజనం టేబిల్ మీదనో దుప్పటి పరుచుకుని కునుకు తీసేస్తాడు.

అతడు భోజనం చేసిందీ లేనిదీ ఎవరూ పట్టించుకోరు. తననెవరూ పట్టించుకోలేదని అతడూ పట్టించుకోడు!

పెళ్లి అయిపోయి, పెళ్లివారంతా వెళ్లిపోయాక సామానులన్నీ ఎవరివి వారికి అప్పజెప్పేసి ఆఖరుకి తను బయలుదేరుతాడు- ''బాగా కష్టపడ్డావు రా వుడూ'' అనే ఓ ఉచిత కాంప్లిమెంట్ అందుకుని. జనం అంత నిర్లక్ష్యం చేస్తున్నా కలత చెందకుండా పిలవడమే తడవుగా బయలుదేరిపోతాడు ఏ కార్యానికైనా. చావు కార్యాలకెళ్లినప్పుడు అతని ఓదార్పులు ఇలా సాగిపోతాయ్–

''దర్జాగా మహారాజులా బతికాడు. అతనికేం లోటు? హాయిగా తనువు చాలించాడు.''

''చాలా అదృష్టవంతుడు! తుది శ్వాస విడిచేటప్పుడు పిల్లలందరూ సమక్షంలోనే ఉన్నారు.''

''తల్లీ, పెద్దవాళ్లు మీరు ఏడుస్తూ కూర్చుంటే ఎలా? పిల్లలు తల్లడిల్లిపోతున్నారు. కాస్త ధైర్యం తెచ్చుకోవాలి మరి.''

''మీరు కాస్త ఎంగిలిపడాలి. ఏమీ ముట్టుకోనంటే ఎలా? తంతంతా ముందర వుంది. మీరుకాక ఎవరు చేస్తారు చెప్పండి?''

ఒకసారి నాకు స్కూటర్ ఏక్సిడెంట్‌లో కుడిచెయ్యి ఎముక విరగడం వలన వారం రోజులు నర్సింగ్ హోంలో ఉండిపోవలసి వచ్చింది. మా ఆవిడ పక్కన ఉన్నాసరే అతను నాకు చేసిన సేవ నా జీవితంలో మరిచిపోలేను. రూంలో 'ఒక్కరు తప్ప మరొకరుండడానికి కుదరద'నేవారు నర్సింగ్‌హోం వాళ్లు. ఇతను ఆ వారంరోజులూ వాళ్లనెలాగో బురిడీ కొట్టించి, మధ్య మధ్య వాళ్ల చీత్కారాలు తింటూ నాతోనే ఉండిపో

యాడు. 'సెలవల్లేక పోవడంవలన ఆ వారం రోజులూ జీతం నష్టంట.' అని తర్వాత మా ఆవిడ చెప్తూవుంటే విలవిల లాడిపోయాను. కొన్ని రోజుల తర్వాత కవర్లో పెట్టి వెయ్యి రూపాయలిస్తూ, "రామారావుగారూ, మీరు చేసిన సర్వీస్‌కి వెలకడుతున్నాననుకోకండి. జీతం నష్టం మీద ఉండిపోయారుట.. అందుకని.." అన్నాను కాస్త జంకుతూ.

"మీరిలా చేస్తే నాకు చాలా బాధగా వుంటుంది. మన మధ్య బంధుత్వం కన్నా స్నేహం ఎక్కువ. దానిని చిన్నబుచ్చకండి" అంటూ సున్నితంగా తిరస్కరించాడు.

• • •

ఆరోజే హైదరాబాదు నుండి వచ్చాను- వారం రోజులు ట్రైనింగ్ పూర్తి చేసుకుని. ఇల్లు చేరగానే మా ఆవిడ పిడుగులాంటి వార్త చెవిలోవేసింది. వెంటనే నేనూ తనూ బయలుదేరాం.

అరగంటలో రామారావుగారిల్లు చేరుకున్నాం. మంచానికి అతుక్కుపోయి ఉన్నాడు మనిషి. కళ్లు పీక్కుపోయి ఉన్నాయి. భార్యా పిల్లలిద్దరూ మంచాని కానుకునే ఉన్నారు. నన్ను చూడగానే అతని కళ్లలో కాస్త వెలుగు కనిపించింది. నేను హైదరాబాదు వెళ్లడానికి వారం రోజుల ముందు మా ఇంటికి వచ్చాడు. కొడుకు ఆర్టీసీలో ఇంటర్వ్యూ ఇచ్చాడుట. అక్కడ ఎవరైనా తెలిసిన వాళ్లచేత కాస్త చెప్పిస్తే ఉద్యోగం దొరికే అవకాశముంటుందేమో కనుక్కోమని. మొట్టమొదటిసారి అతను అర్థించిన సాయం! అబ్బాయి వివరాలు తీసుకుని 'తప్పకుండా ప్రయత్నిస్తా'నన్నాను. ట్రైనింగ్ అయిపోయాక రెండురోజులు సెలవు పెట్టి ఉండిపోయిందందుకే!

"ఉద్యోగం ఖాయం అయింది. వారం రోజుల్లో అపాయింట్‌మెంట్ ఆర్డరు వచ్చేస్తుంది." అని అతనికి వినబడేలా చెవి దగ్గర చెప్పి మంచం దండెం మీద కూర్చున్నాను.

భారంగా రెండు చేతులూ కూడదీసుకుని కృతజ్ఞతా పూర్వకంగా చూస్తూ జోడించాడు. నా కళ్లు చెమ్మగిల్లాయి. "తప్పు రామారావుగారూ, మీరు నాకు నమస్కారం పెట్టడమేమిటి?" అన్నాను బాధగా.

అబ్బాయిని పిలిచి అతడి చేయి నా చేతిలో పెట్టాడు. కళ్లంట నీరు కారుతూంటే జేబురుమాలుతో కళ్లు తుడిచాను. "నేనున్నా. అన్నీ చూస్తాను. మీరేమీ దిగులు పడకండి" అన్నాను.

మా ఆవిడ అతని భార్యని ఓదారుస్తోంది. డాక్టరు వచ్చి చూసాడు. "సమయం ఆసన్నమైంది" అన్నాడు నన్ను పక్కకి పిలిచి.

మరికొంతసేపటికి దీపం ఆరిపోయింది!

భార్యాపిల్లలూ గొల్లుమన్నారు.

బంధువులు వచ్చారు.

ఉన్నన్నాళ్లూ ఏ నిర్వాకం చేసుకోలేకపోయాడన్నారు.

ఊరి వాళ్లకి ఊడిగం చెయ్యడంతోనే అయిపోయిందన్నారు.

నాలుగు రాళ్లు వెనకేసుకోలేకపోయాడన్నారు.

తన బాగోగులు చూసుకోకుండా మరీ అంతగా సేవ చేయడమేమిటన్నారు. ఆ మాటలంటున్న వారంతా కాస్తో కూస్తో అతని సాయం పొందినవాళ్లే!

'మీరు బంధువులు కారు. రాబందులు! జరగవలసినదంతా నేను జరుపుతాను. మీరంతా పొండి.' అనాలనిపించింది.

అతని భార్యాపిల్లలూ శవం మీదపడి ఏడుస్తున్నారు. ఎందర్నో చల్లటి మాటలతో ఓదార్చిన రామారావు తన వాళ్లని ఓదార్చలేని స్థితిలో నిర్జీవంగా పడి ఉన్నాడు!

అతనిని స్ఫూర్తిగా తీసుకుని పిల్లల్ని ఓదార్చేను. అనవలసినవి అనేసి కొంత జనం వెళ్లిపోయారు. దగ్గర బంధువులు కొందరు మిగిలారు. నేనూ తనూ పన్నెండు రోజులూ అక్కడే ఉండిపోయాం.

దగ్గరుండి ఏ లోటూ లేకుండా అన్ని దానాలతో సహా కార్యం జరిపించాను. కొడుకు అపాయింట్‌మెంట్ ఆర్డరు మేం బయలుదేరుతూండగా వచ్చింది. మనసు తృప్తి పడింది. 'పాపం, రామారావుంటే ఎంత సంతోషించేవాడో' అనుకున్నా శ్రీమతి పక్కన రిక్షాలో కూర్చుంటూ.

• • •

"కోపరేటివ్ లోను వచ్చాక నీ స్టెప్పుల చెయిన్ చేయిస్తా. ఎరియర్స్ పాతిక వేలలో పదివేలు మాత్రమే మిగిలాయ్" అన్నాను మా ఆవిడతో ఆ రాత్రి నిద్ర పోయే ముందు.

మౌనంగా నావైపు అదోలా చూసింది తను.

"పదిహేను వేలు రామారావుగారి దినవారాలకి ఖర్చు అయిపోయాయి. ఆ అబ్బాయికి జీతం అందే సరికి మరో నెల పడుతుంది. అందుకని.. ఈ పది వేలూ.. వాళ్లకే ఇచ్చేద్దామనుకుంటున్నాను. నీకు ప్రామిస్ చేసాను ఎరియర్స్ డబ్బుతో స్టెప్పుల చెయిన్ చేయిస్తానని. కాని.. ఆ డబ్బు ఇలా అయిపోయింది. ఒక్క నెల రోజుల్లో చేయిస్తా. ప్రామిస్." అన్నాను సంశయిస్తూ.

హటాత్తుగా లేచి నా తలని తన గుండెలకు హత్తుకుంది. "ఇంత మంచి మనసున్న మీరు నా దగ్గర ఉండగా నాకే ఆభరణాలూ అక్కరలేదండీ" అంది ప్రేమగా.

అందుకే అన్నాను- "నేను అదృష్టవంతుణ్ణి! నీ లాంటివారు వుంటారు.. నూటికొక్కరు!" అని.

"నాలాంటివారు కాదు! రామారావు లాంటివారు వుంటారు నూటికొక్కరు" అంది మా ఆవిడ! ★

## అంధులను ఆనందింపచేసే పూలతోటలు



కళ్లున్నవారినే కాదు, కళ్లు లేనివారిని కూడా అలరిస్తాయట అక్కడి పూలతోటలు! 'హాంకాంగ్'లో ఎనభై రకాల పూలచెట్లు, మొక్కలు, పొదలు మొదలైన వాటిలో రెండు సుందరమైన తోటలని రూపొందించారు. ఇక్కడి పువ్వుల మొక్కలు వెదజల్లే అపూర్వమైన సువాసనలు, ఆకారాలు, పరిమాణాలు మొదలైన వాటిని అంధులు స్పర్శవల్ల, వాసనవల్ల తెలుసుకుని ఆనందాన్ని పొందుతుంటారు. ఆనందానికి అంధత్వం లేదు కదా మరి!

## పెద్ద పురాణం

ప్రపంచంలోని గ్రంథాలు, పురాణాలు, శాస్త్రాలు మొదలైన వాటన్నింటిలోకీ భగవద్గీత అతి చిన్నది. పురాణాల్లో మహాభారతమే చాలా పెద్దది. దీన్లో సుమారు మూడు మిలియను మాటలు, నూరు వేల శ్లోకాలు వున్నాయి. అందుకే మరి 'మహా' భారతం అన్నారు.

## పిన్‌కోడ్ నంబర్లు

భారతదేశంలో పోస్టు అండ్ టెలిగ్రాఫ్ డిపార్టుమెంటు, ఉత్తరాలు సులభంగా ఆయా ప్రదేశాలకు చేరేందుకు 'పోస్టల్ ఇండెక్స్ నంబర్స్'ను అంటే పిన్‌కోడ్స్‌ను ఆగస్టు 15, 1972న ప్రవేశపెట్టింది.

## సూపర్ కాలీఫ్లవర్

యుగోస్లేవియా (యూరప్)లో ఒక రైతు తన పొలంలో సూపర్ కాలీఫ్లవర్‌లను పెంచాడు. ఇవి ఎంత పెద్దవంటే, ఒక్కొక్క కాలీఫ్లవర్ ఐదు కిలోల బరువు తూగుతుంది. ఏ ఎరువులు, మందులు ఉపయోగించకుండానే, ఆ రైతు వీటిని పండించాడు. కాలీఫ్లవర్‌లే కాదు, ఆ రైతు కూడా 'సూపర్ రైతే' నన్నమాట!

- సింధు

